క్లుప్తంగా

18న చేనేత కార్మికసంఘ సమావేశం

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం సర్వసభ్య సమావేశాన్ని 18న పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మదనపల్లె డివిజన్ కన్వీనర్ రామసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలపై సమావేశంలో చర్చలు జరిపి వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశానికి చేనేత కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డీఎస్పీ పోస్టులను పునరుద్ధరించాలి

బి.కొత్తకోట: రాష్ట్రంలో రద్దయిన 98 ఎస్సీ, ఎస్టీ పోలీస్‌స్టేషన్ల డీఎస్పీ పోస్టులను ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించేలా చొరవ చూపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు కోరారు. ఆదివారం బి.కొత్తకోటలో ఆయన నారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సమస్యపై చర్చించారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని అన్నారు. దీనికి పరిష్కారం కోరుతూ ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని శ్రీచందు తెలిపారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి చేస్తామని తెలిపారు.

19న వారపుసంత బహిరంగ వేలం

మదనపల్లె : 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, మున్సిపాలిటీకి చెందిన వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, టౌన్‌హాల్ లీజ్ ఇచ్చేందుకు ఈనెల 19వతేదీన మున్సిపల్ కార్యాలయంలో 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులలో దిగువ, మొదటి అంతస్థులోని 51 గదులకు మూడేళ్ల కాలపరిమితితో నెలసరి అద్దెపై బాడుగకు ఇచ్చేందుకు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు కార్యాలయ పనివేళల్లో మున్సిపాలిటీలో రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ముదివేడు జాతరకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: కురబలకోట మండలం ముదివేడు దండుమారెమ్మ జాతరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈనెల 19,20 తేదీల్లో జరిగే జాతరకు మదనపల్లె నుంచి మదివేడుకు 20 బస్సులు, ముదివేడు నుంచి తంబళ్లపల్లెకు రెండు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. రెండు రోజుల జాతరకు ప్రత్యేక సర్వీసులు సాధారణ చార్జీలతో నడుపుతామన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

గ్రామ దేవతలకు పూజలు



అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె: మండలంలోని పంచాలమర్రిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవతలు వాయలచెట్ల గంగమ్మ, దండుమారెమ్మ దేవతా విగ్రహాలను ఆదివారం వైభవంగా ప్రతిష్ట చేశారు. వేదపండితులు హోమాలు నిర్వహించి అమ్మవార్ల విగ్రహాలను సంప్రదాయబద్ధంగా ప్రాణప్రతిష్ట చేశారు. మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా బాలువికాస్ ఎంపిక



పీలేరు : స్థానిక ఇందిరానగర్‌లో కాపురం ఉంటున్న చలపతి రాజు, అన్నపూర్ణల కుమారుడు జొన్నగడ్డల బాలువికాస్ జీఎస్టీ ఇన్స్‌పెక్టర్‌గా సెలెక్ట్ అయ్యాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సీజీఎల్ 2024 పరీక్షల్లో సాధారణ కేటగిరిలో ఆల్‌ఇండియా ర్యాంక్ 1173 సాధించి ప్రతిభ కనబరిచాడు. దీంతో సెంట్రల్ రెవెన్యూ శాఖ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ జీఎస్టీ అండ్ సెంట్రల్ ఎక్సైజ్‌గా సెలెక్ట్ అయ్యాడు. ఆయన్ను కుటుంబ సభ్యులు, బంధువులు అభినందనలు తెలిపారు.

నాగారపమ్మకు పూజలు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఆదివారం ఉదయం పూజారులు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గంగమ్మా .. చల్లంగ చూడమ్మా



బోనాలతో వెళుతున్న మహిళలు



దర్శనం కోసం క్యూలో భక్తులు

- ఘనంగా కనుమలో గంగమ్మ జాతర
- అమ్మవారికి బోనాలు సమర్పణ
- ఉత్సాహంగా ఉట్లమాను పోటీలో పాల్గొన్న యువత

మదనపల్లె సిటీ: గంగమ్మ ...చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ పుంగనూరురోడ్డులోని శ్రీ కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పగలు తిరునాల ఘనంగా జరిగింది. ఆలయం విద్యుత్ దీపాల వెలుగుల మధ్య వెలిగిపోయింది. ప్రత్యేక అలంకరణలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వెరసి జాతర వైభవంగా జరిగింది. ఓ వైపు అమ్మవారికి అర్చకులు పూజలు చేస్తుండగా .. మరోవైపు ఉత్సాహంతో జనం జాతరలో పాల్గొన్నారు. ఉదయం అమ్మవారికి బసినికొండ, గంగన్నగారిపల్లె, వలసపల్లె, డ్రైవర్స్‌కాలనీకు చెందిన మహిళలు ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి చీర, సారెలను అందజేశారు. మదనపల్లె–పుంగనూరు జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ ఈఓ రమణ, బసినికొండ పంచాయతీ నాయకులు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. సూర్యారాక్స్ అ.ధినేత గుత్తా హరికృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం ప్రాంగణంలో దుకాణాలు వెలిశాయి. చిన్నపిల్లల కోసం జెయింట్‌వీల్ ,డ్రాగన్‌ట్రైన్, కొలంబస్, రంగులరాట్నం వంటి పరకరాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్ల తిరునాల నిర్వహించారు.యువకులు ఉత్సాహంగా పోటీలు పడి ఉట్లమాను ఎక్కేందుకు ప్రయత్నించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శీతక యుగంధర్,నాగేంద్ర, కత్తి లక్ష్మన్న, గుట్ట రమణ, శీతక విక్రమ్, నటశేఖర నాగేంద్ర పాల్గొన్నారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు

పీలేరు రూరల్ : మామిడిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. ఆదివారం స్థానిక సీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో పీలేరు, కేవీపల్లె మండలాల మామిడి రైతులకు మామిడి పూత, పిందె దశలో సస్యరక్షణ, కవర్ల వినియోగం, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40 వేల హెక్టార్లలో మామిడి సాగు ఉందని, ప్రధాన పంటగా మామిడిని గుర్తించడం జరిగిందన్నారు. 1600 హెక్టార్లకు సబ్సిడీతో 1.60 కోట్ల పండ్ల కవర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా పది వేల కవర్లు ఇస్తామని చెప్పారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కవర్లు మామిడి కవచం లాంటివని, దీంతో నాణ్యమైన పంట దిగుబడి తోపాటు మంచి మార్కెటింగ్ ఉంటుందని తెలిపారు. పిందె, కాయ దశలో తేనెమంచు పురుగు ఆశించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఏడీఏ వై.వి. రమణరావు, ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు బోడేషావలి, ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, ఉద్యానశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పిరస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఆర్యవైశ్య సంఘనాయకులు




పీలేరులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక వాసవీభవన్‌వీధిలోని ఆర్యవైశ్య కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన సేవలు,ప్రాణత్యాగం గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు పూనగంటి ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, కోశాధికారి గిరిధర్, అమరనాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు జయంతి

పీలేరు : పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం స్థానిక వీ211ఏ వాసవిక్లబ్ గ్రేటర్స్, వాసవికపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వారపుసంతక వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు 58 రోజులు సంపూర్ణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రేపూరి సుధీర్, ట్రెజరర్ కేసర్ల బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు పామిడి మల్లికార్జున, శ్రీపురం వెంకటేష్, ఐఈసీ ఆఫీసర్ సోమిశెట్టి సురేష్‌బాబు, వివిధ సంఘాల నాయకులు సురేష్, గోవర్ధన్‌ప్రసాద్, అనిల్‌కుమా, సుమంత్‌కుమార్, శంకరనాథ్,ఉమామహేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వీరనాగమ్మ జాతర



ప్రదక్షణ చేస్తున్న చాందినీ బండి

వీరబల్లి : మండలంలోని గుర్రప్పగారిపల్లి పంచాయతీలో వెలసిన వీరనాగమ్మ జాతర ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో శనివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బిడ్డలు లేని స్త్రీలు అమ్మవారి దగ్గర వరపడ్డారు. శనివారం రాత్రి మొక్కుబడి ఉన్న వారు అమ్మవారి చుట్టూ చాందినీ బండ్లు ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అలానే జాతరలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పలు సంస్కృతి కార్యక్రమాలు, చెక్క భజనలు భక్తులను ఎంతగానో అలరించాయి. జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాలయ ధర్మకర్త శ్రీహరి నాయుడు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రారంభమైన పాలేటమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో కొలువైవున్న శ్రీ పాలేటమ్మ అమ్మవారి జాతర వైభవోపేతంగా ప్రారంభమైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్ మూర్తిని పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని రాయచోటి డీఎస్పీ కొండయ్యానాయుడు పర్యవేక్షణలో రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆదేశానుసారం ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు గట్టి పోలీసు బందోబస్తును నిర్వహించారు. చాందినీబండ్ల రాకతో ఆలయం కిటకిటలాడనుంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



కె.ప్రసాద్ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రసాద్

పీలేరు రూరల్: లారీ బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై పీలేరు రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారంపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీకి చెందిన కె. ప్రసాద్ (35) పీలేరు పట్టణంలోని సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే దుకాణం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో చిత్తూరు వైపు నుంచి కలకడ టమాటా మార్కెట్‌కు వస్తున్న లారీ కె.ప్రసాద్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను స్థానికులు పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పీలేరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

మదనపల్లె సిటీ: విద్యార్థి జీవితంలో తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాసే రోజు రానే వచ్చింది. సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షల జరుగుతాయి. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో పరిధిలో 4,180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆదివారం పరీక్షా కేంద్రాలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. కేంద్రాల్లో తాగునీరు, ఫర్నీచర్, విద్యుత్ సౌకర్యం కల్పించారు.అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించి 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్సు కేంద్రాలు,నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినట్లు ఆర్టీసీ డీఎం–1 వెంకటరమణారెడ్డి తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



విద్యార్థులు పరీక్షలు ప్రశాంతంగా రాయాలి. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి. గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.
–ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ,మదనపల్లె

మాలల సమస్యలు పరిష్కారమే లక్ష్యం



నూతన కమిటీకి నియామక పత్రం అందిస్తున్న గుర్రం నారాయణ

పీలేరు : మాలల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా అఖిలభారత మాల సంఘాల జేఏసీ (ఏబీఎంఎస్ జేఏసీ) చిత్తూరు, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు గుర్రం నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పద్మావతి నగర్‌లో ఏబీఎంఎస్ జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, వర్గీకరణ, క్రిమిలేయర్ అంశాలపై, దళితుల హక్కుల అణచివేతపై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఏబీఎంఎస్ జేఏసీ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గుండ్లూరు నాగరాజ, ప్రధాన కార్యదర్శిగా వ. శివనందన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నక్కా వెంకటరమణ, కె. నరసింహులు, రామాంజులు, మద్దెల రమేష్, రామచంద్రయ్య, పల్లం నారాయణ, లోకర్జున, రమణ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలను సమర్పించారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు భక్తుల ఆలయమెట్లకు పూజలు నిర్వహించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో నిసార్‌అహ్మద్



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె : నిమ్మనపల్లె మండల వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి కుమార్తె వివాహ మహోత్సవానికి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ హాజరయ్యారు. శనివారం రాత్రి పట్టణంలోని శ్రీరామ తులసీకల్యాణమండపంలో జరిగిన వివాహ వేడుకల్లో, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. నూతన వధూవరులు జీవన్‌ప్రసాద్‌రెడ్డి, సురక్షను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిమ్మనపల్లె, రామసముద్రం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కొమ్మేపల్లె శ్రీనివాసులు, కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, భాస్కర్‌గౌడ్, కొండూరుకృష్ణారెడ్డి, ఆర్‌ఐ.వెంకటరమణారెడ్డి, ఎస్.ఏ.కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

పీలేరురూరల్ : జిల్లా వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి కుమారుడు దిలీప్‌కుమార్‌రెడ్డితో గూడరేవుపల్లె పంచాయతీ పుట్టావాండ్లపల్లెకు చెందిన ఎం. శంకర్‌రెడ్డి కుమార్తె సాయిప్రియారెడ్డి నిశ్చితార్థం స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించారు. అలాగే స్థానిక ఎంఎన్‌ఆర్ కల్యాణమండపంలో జరిగిన భవ్యశ్రీరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివాహానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించారు.

కలికిరి: నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి మండలాల్లో పలు శుభ కార్యక్రమాలకు హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి అభినందనలు తెలియజేశారు. పీలేరు పట్టణం ఎంఎన్‌ఆర్ గార్డెన్స్‌లో జరిగిన కొమ్మేపల్లి క్రిష్ణకిశోర్ రెడ్డి కుమార్తె కె.భవ్యశ్రీ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో శంకర్‌రెడ్డి కుమార్తె సాయిప్రియ, నరసింహారెడ్డి కుమారుడు దిలీప్ కుమార్ రెడ్డిల నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. కార్యక్రమాలలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, పీలేరు, కలికిరి మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చింతల రమేష్‌కుమార్‌రెడ్డి, గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపనోత్సవం



ప్రత్యేక పూజలు చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలో ఉన్న శ్రీ వెంకట శివసాయి ఆలయం జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచింది. ఈ ఆలయ ప్రాంగణంలో నూతనంగా పలు ఆలయాలను ఆలయ చైర్మన్ వెంకటనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించారు. ఆదివారం వేదపండితులు శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ రాజరాజేశ్వరీ దేవీల విగ్రహాల ప్రతిష్టతోపాటు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ, అన్న ప్రసాదాలను స్వీకరించారు. అంతకుముందు ఆలయం వెలుపుల ధ్వజస్తంభ ప్రతిష్టతను శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా పూజల్లో లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొని ప్రతిష్ట విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ రామచంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మధు, భానుమూర్తి, ఆనంద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రామచంద్ర పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యంపై అప్రమత్తంగా ఉందాం

రాజంపేట రూరల్ : వినికిడి సమస్యలు రాకుండా ఉండాలంటే శబ్ద కాలుష్యం పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ స్పీచ్ థెరపిస్ట్ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఆర్‌ఎస్‌రోడ్‌లోని రత్న స్పీచ్ థెరపీ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఆదివారం సొసైటీ ఫర్ అప్లీమెంట్ ఆఫ్ రూరల్ ఎకనామీ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి పరీక్ష శిబిరాన్ని స్పీచ్ థెరపిస్ట్ వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మందికి వినికిడి పరీక్షలు ఉచిత నిర్వహించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఫెడరేషన్ నాయకుడు నాగేశ్వరరావు

రాజంపేట రూరల్ : ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఆటో డ్రైవర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆటోడ్రైవర్లు ప్రభుత్వానికి కోట్ల రూపాయల పన్ను కడుతున్నారని తెలియజేశారు. భారీగా చలానాలు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 2131ని రద్దు చేయాలని కోరారు. ఆటో కార్మికులపై భారాన్ని మోపరాదన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నాయకులు పెంచలయ్య, వెంకటేశు, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.